సాక్షి ఆదిలాబాద్

మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



ఆధారాలు లేకుంటే జప్తే.. 8లో▸

ఎన్నికల నేపథ్యంలో పెద్ద మొత్తంలో నగదుతో బయటకు వెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త. కోడ్ అమల్లోకి వచ్చిన క్రమంలో నగదుకు ఆధారాలు చూపకుంటే జప్తు అవడం ఖాయం.



పేరుకే క్రీడా ప్రాంగణాలు 9లో▸

యువతకు క్రీడలపై ఆసక్తి పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆయా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి.

గరిష్టం/కనిష్టం
35.0/23.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. చాలా వరకు ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

కైలాస్‌నగర్: ప్రజావాణిలో అందించే అర్జీలు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బాధితుల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించాల్సిందిగా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చే అర్జీలను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కరించని సమస్యలుంటే వాటిపై అర్జీదారులకు స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో రాథోడ్ రమేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందించండి

కైలాస్‌నగర్: పంట నష్టపోయిన తమకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని తలమడుగు మండలంలోని భరంపూర్, పల్లి(బి), పల్లి (కె), నందిగామ, మధునాపూర్ గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో కురిసిన వడగండ్ల వానతో యాసంగిలో సాగుచేసిన జొన్న, మొక్కజొన్న, కూరగాయల పంటలు భారీగా దెబ్బతిన్నాయన్నారు. ఈ నష్టపోయిన పంటలను ఉన్నతాధికారులు పరిశీలించి పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఇప్పటి వరకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

జిల్లా 'మత్స్య' సహకార సంఘం రద్దు

కైలాస్‌నగర్: రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘంను ఈనెల 9న రద్దు చేసినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి వై.సాంబశివరావు ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సహకార రంగాల చట్టం 1964 సెక్షన్ 14 (2)బి ప్రకారం నూతన జిల్లాలో 2 లేదా 3 నూతన మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఏర్పడితే ప్రస్తుతమున్న ఉమ్మడి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం రద్దవుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రస్తుత సంఘాన్ని రద్దు చేసి నూతన సంఘ ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లుగా వెల్లడించారు. జిల్లాలోని మత్స్యకారులు విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

నేడు జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 14, 17 ఏళ్ల విభాగంలో బాలబాలికల జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు మంగళవారం నిర్వహించనున్నట్లు కార్యదర్శి కాంతారావు ప్రకటనలో తెలిపారు.పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు గ్లౌవెంట తెచ్చుకోవాలని, ఆసక్తి అర్హత కలవారు సంబంధిత వ యసు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 11 గంటలకు పోటీల ఆర్గనైజర్ ఎస్.స్వామికి స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. పోటీలకు ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు చొప్పున క్రీడాకారులు హాజరయ్యేలా వ్యాయామ ఉపాధ్యాయులు చూడాలని కోరారు. 17 ఏళ్ల విభాగంలో ఎంపికైన బాలబాలికలు ఈనెల 11న నిర్మల్‌లో నిర్వహించనున్న జోనల్‌స్థాయి పోటీలకు హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

మోగిన నగారా



- ఎన్నికల షెడ్యూల్ జారీ.. అమల్లోకి కోడ్
- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు బ్రేక్
- మార్గదర్శకాలు జారీ

సాక్షి, ఆదిలాబాద్: శాసనసభ ఎన్నికల షెడ్యూల్ జారీ అయింది. ఎలక్షన్ కోడ్ తక్షణమే అమలులోకి వచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం సీఈసీ రాజీవ్‌కుమార్ సోమవారం ప్రకటించడంతో ఎన్నికల నగారా మోగింది. నేటి నుంచి డిసెంబర్ 3 వరకు అంటే 55 రోజులు రాజకీయ సంగ్రామం సందడిగా మారనుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఇతర పార్టీల నుంచి కూడా పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ప్రజల ఆసక్తికూడా నెలకొంది. ఇదిలా ఉంటే అభ్యర్థులు, రాజకీయ పార్టీల ఖర్చులపై ఎన్నికల కమిషన్ ఇకపై నిరంతరంగా నిఘా పెట్టనుంది. జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ రాహుల్‌రాజ్ జిల్లాలో ఎన్నికల ప్రక్రియపై వివరాలు వెల్లడించారు.

ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆదిలాబాద్	1,15,835	1,19,908	5	2,35,748
బోథ్	1,00,658	1,06,031	3	2,06,690
ఖానాపూర్	1,06,985	1,10,667	13	2,17,665
ఆసిఫాబాద్	1,11,878	1,12,766	17	2,24,661

పోలింగ్ కేంద్రాలు

నియోజకవర్గం	సంఖ్య
ఆదిలాబాద్	290
బోథ్	302
ఖానాపూర్	305
ఆసిఫాబాద్	301

మార్పులు, చేర్పులకు అవకాశం

కేంద్ర ఎన్నికల సంఘం ఈనెల 4న తుది ఓటరు జాబితాను జారీ చేసింది. నియోజకవర్గాల వారీగా పురుషులు, మహిళలు, మొత్తం ఓటర్ల వివరాలను వెల్లడించింది. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలు కలిపి 8,949 కొత్త ఓటర్లు నమోదయ్యారు. ఇక జిల్లా పరిధిలో కొంత భాగం ఉన్న ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ఈ కొత్త ఓటర్లు సుమారు 3500 వరకు పెరిగారు. ఇదిలా ఉంటే ఈ నెల 17వరకు ఓటరు లిస్టులో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు. ఓటర్లకు 2 కిలోమీటర్లలోనే పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నారు.

అమలులోకి ఎలక్షన్ కోడ్..



కలెక్టరేట్ ఆవరణలో ఫ్లెక్సీని తొలగిస్తున్న సిబ్బంది

ఎన్నికల షెడ్యూల్ విడుదలతోనే కోడ్ కూడా అమలులోకి వచ్చింది. రాష్ట్ర మొత్తం ఎన్నికల కమిషన్ కంట్రోల్‌లోకి వెళ్లిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త పథకాలు ప్రకటించరాదు. పార్టీల పరంగా ఇక ప్రకటించేది మేనిఫెస్టోలే.. అధికారికంగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయరాదు. దీనికి సంబంధించి మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఎన్ని కల ర్యాలీలు, బహిరంగ సభల నిర్వహణకు ముందు అభ్యర్థులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఎన్నికలు ముగిసే వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయి. ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించి సంక్షేమ పథకాల ఫ్లెక్సీలను తొలగించింది.

నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- నవంబర్ 3 నుంచి నామినేషన్ల స్వీకరణ
- పత్రాలు లేకుండా రూ.50వేలకు మించి తీసుకెళితే సీజ్
- కలెక్టర్ రాహుల్‌రాజ్



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, చిత్రంలో ఎస్పీ , ఐటీడీఏ పీవో

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన క్రమంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్నికల కోడ్ వివరాలు వెల్లడించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ సోమవారం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిందని తెలిపారు. దీంతో నియమావళి అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. నవంబర్ 3న నోటిఫికేషన్ విడుదల కానుందని, 10 వరకు నామినేషన్ల గడువు, 13న పరిశీలన, 15న ఉపసంహరణ, 30న పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 3న కౌంటింగ్ ఉంటుందని వివరించారు. ఓటర్లు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఓటరు లిస్టుతో తమ పేర్లు ఉన్నయో లేవో పరిశీలించుకోవాలన్నారు. ఎవరైనా పేర్లు లేకపోతే నామినేషన్లకు పది రోజుల ముందు వరకు ఫారం–6 ద్వారా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పోటీ చేసే అభ్యర్థులకు నిబంధనలతో కూడిన బుక్‌లెట్ అందజేస్తామన్నారు. నియమావళిని పరిశీలించేందుకు ఫ్లయింగ్‌స్క్వాడ్ నియమించినట్లు తెలిపారు. అలాగే అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అక్కడ నిరంతరం సీసీ నిఘా, వీడియో చిత్రీకరణ ఉంటుందన్నారు. వీటిని కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు అనుసంధానం చేశామన్నారు. ఎప్పటికప్పుడు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తామన్నారు. అలాగే సర్వేలైన్ అధికారుల ద్వారా పరిస్థితులను సమీక్షిస్తామన్నారు. ఒకవ్యక్తి రూ.50వేలకు మించి నగదు వెంట తీసుకెళ్లరాదని, అంతకు మించి తీసుకెళితే సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే డబ్బును సీజ్ చేస్తామన్నారు. అలాగే ఓటర్లను ప్రలోభాలకు గురి చేయవద్దని, సభలు, సమావేశాలు నిర్వహించే ముందు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.ఎన్నికల నిర్వహణ కోసం అన్నిఏర్పాట్లు చేస్తామన్నారు. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా పెడుతామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సంక్షేమ పథకాలు సూచించే ఫ్లెక్సీలు తొలగించామన్నారు. ఇందులో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఐటీడీఏ పీవో చాహత్‌బాజ్‌పాయ్ పాల్గొన్నారు.

'కోడ్' కట్టుదిట్టంగా అమలు చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

ఎదులాపురం: ఎన్నికల కోడ్ కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లపై హైదరాబాద్ నుంచి సోమవారం ఆయన ఆయా జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, షెడ్యూల్ విడుదలతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. 24 గంటల వ్యవధిలో ప్రభుత్వ భవనాల్లో వివిధ రాజకీయ పార్టీలు, నాయకులకు సంబంధించిన హోర్డింగులు, ఫొటోలు, వాల్‌రైటింగ్ తొలగించాలన్నారు. అలాగే 48 గంటల వ్యవధిలో పబ్లిక్ ప్రాపర్టీస్ వద్ద, 72 గంటల్లోగా ప్రైవేట్ స్థలాల్లో హోర్డింగులు, ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశించారు. నవంబర్ 3న అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని, అప్పటి వరకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్ ఏర్పాటు, ఎన్నికల విధుల నిర్వహణకు సిబ్బంది శిక్షణ, తదితర కార్యక్రమాలు పూర్తి చేయాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వివరాలు సమర్పించాలన్నారు. శాంతిభద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, లైటింగ్, ర్యాంపు వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. అలాగే ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. నామినేషన్లు స్వీకరించే సమయంలో రిటర్నింగ్ అధికారులకు భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందులో కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ డి. ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా, శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలందప్రియా, తదితరులు పాల్గొన్నారు.



సభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జర్మన్‌టెంట్

'జనగర్జన'తో శంఖారావం

- నేడు జిల్లా కేంద్రానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా
- డైట్ మైదానంలో బహిరంగసభ
- ఆదిలాబాద్ కాషాయమయం

సాక్షి,ఆదిలాబాద్: షెడ్యూల్ విడుదలతో బీజేపీ ఎన్నికల శంఖారావం పూరిస్తుంది. ప్రచారంలో భాగంగా రాష్ట్రంలోనే తొలి బహిరంగ సభ ఆదిలాబాద్‌లో నిర్వహిస్తున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మంగళవారం జిల్లా కేంద్రానికి విచ్చేయనున్నారు. ఈ బహిరంగసభకు జనగర్జనగా నామకరణం చేశారు. డైట్ మైదానంలో మధ్యాహ్నం ఒంటి గంటకు సభ ప్రారంభం కానుంది. రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, నేతలు బండి సంజయ్, ఈటల ఇతరత్రా ముఖ్యనేతలతో పాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాలు చూసే జాతీయనేతలు కూడా హాజరు కానున్నారు. ఈ సభ కోసం కొద్ది రోజులుగా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ఈ సభ ద్వారా బీజేపీ ఎన్నికల సమరశంఖం పూరించనుంది.

లక్ష జనసమీకరణ..

ఈ సభ కోసం బీజేపీ భారీగా ఏర్పాట్లు చేసింది. డైట్ మైదానంలో నిర్వహిస్తుండగా ప్రాంగణంలో జర్మన్ టెంట్ ఏర్పాటు చేశారు. ఎలాంటి వాతావరణంలోనైనా ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకే ఈ ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉంటే ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి సుమారు లక్ష జనాన్ని సమీకరించేలా ప్రణాళిక చేశారు. ఆయా నియోజకవర్గాల బాధ్యులు జనసమీకరణపై దృష్టి సారించారు.

కాషాయమయం..

బీజేపీ జనగర్జన సభ నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రం పూర్తిగా కాషాయమయంగా మారిపోయింది. పట్టణంలోని డివైడర్ పొడవునా, ముఖ్య కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. చౌక్‌లను పార్టీ జెండాలతో నింపేశారు. ఎన్నికల తొలి బహిరంగ సభ కావడం, కేంద్ర హోంమంత్రితో పాటు జాతీయ, రాష్ట్ర ముఖ్య నేతలు వస్తుండటంతో భారీ ఏర్పాట్లు ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిలా ఉంటే స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు. హోంమంత్రి హెలీక్యాప్టర్ అక్కడ దిగనుంది. అక్కడి నుంచి ప్రత్యేక వాహనం ద్వారా డైట్ మైదానానికి చేరుకుంటారు. అడుగడునా బందోబస్తు ఏర్పాటు చేశారు. అమిత్ షా జెడ్‌ప్లస్ సెక్యూరిటీలో ఉండడంతో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ డి.ఉదయ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. హెలీప్యాడ్ స్థలంతో పాటు బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించారు.



బీజేపీ జెండాలు, ఫ్లెక్సీలతో తెలంగాణచౌక్

బీజేపీతోనే అవినీతిరహిత పాలన

- అమిత్‌షా సభను విజయవంతం చేయాలి
- పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 'గుజ్జుల'



మాట్లాడుతున్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

ఆదిలాబాద్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే అవినీతి రహిత పాలన సాధ్యమవుతుందని రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జనగర్జన సభ ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతోందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో నాలుగు కోట్ల ప్రజలను సీఎం కేసీఆర్ పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం కుటుంబ అభివృద్ధికి మాత్రమే సీఎం కృషి చేశారని, అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. మరోవైపు ప్రధాన మోదీ నాయకత్వంలో కేంద్రంలో నీతిమంతమైన పాలన సాగుతుందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలోని గిరిజనులు విద్య, ఉద్యోగ పరంగా మరింత ముందుకు వెళ్లేందుకు స్వయంగా ప్రధాని మోదీ గిరిజన వర్సిటీ ప్రకటించారన్నారు. జిల్లాలో బీజేపీకి ఎంతో ప్రజాదరణ ఉందని, ఇక్కడి నుంచి పార్లమెంట్ స్థానాన్ని గెలవడంతో పాటు గతంలో పలు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సానుకూల ఫలితాలు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో ఎన్నికల శంఖారావాన్ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదిలాబాద్ నుంచి పూరించనున్నట్లు వెల్లడించారు. ఈ బహిరంగ సభకు ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అంతకు ముందు సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

కేంద్రం నిధులతోనే నూతన రైల్వేలైన్

- ఎంపీ సోయం బాపూరావు



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావు

బోథ్: ఆదిలాబాద్–పటాన్‌చెరు నూతన రైల్వే నిర్మాణం పూర్తిగా కేంద్రం నిధులతోనే చేపడుతున్నట్లు ఎంపీ సోయం బాపూరావు తెలిపారు. సొనాల గ్రామంలో మున్నూరుకాపు భవన నిర్మాణం కోసం రూ.5లక్షల నిధుల ప్రొసీడింగ్స్‌ను సోమవారం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ, ఎంపీగా గెలుపొందిన తరువాత నూతన రైల్వేలైన్‌తో పాటు అనేక అభివద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో బీజేపీని గెలిపించాలన్నారు. ఆయన వెంట రైల్వేబోర్డు సభ్యులు జీవీ రమణ, రాజుయాదవ్ పాల్గొన్నారు.

నిత్యజీవితంలో అన్వయించుకోవాలి



మాట్లాడుతున్న లెఫ్టినెంట్ కల్నల్ వికాస్

ఆదిలాబాద్: ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో నేర్చుకున్న అంశాలను నిత్యజీవితంలో అన్వయించుకోవాలని ఉమ్మడి జిల్లా ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ వికాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 2న ప్రారంభమైన 32–టీ బెటాలియన్ ఎన్‌సీసీ సంయుక్త వార్షిక శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాల్లో కేడెట్లు మంచి ప్రతిభ కనబరిచారన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు జగ్‌రామ్, ఆనంద్‌రావు, శ్రీనివాసరావు తదితరులున్నారు

దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో పబ్లిసిటీ అసిస్టెంట్ (ఫొటోగ్రాఫర్–1, వీడియో కెమెరామెన్–1) పోస్టులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. పబ్లిసిటీ అసిస్టెంట్ (ఫొటోగ్రాఫర్) పోస్టుకు పదో తరగ తి ఉత్తీర్ణత, ఐదేళ్ల అనుభవం, పబ్లిసిటీ అసిస్టెంట్ (వీడియోకెమెరామెన్) పోస్టుకు తెలంగాణ/ ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ బోర్డు నుంచి సినీ ఫొటోగ్రఫీ డిప్లొమా కలిగి ఉండాలని పేర్కొన్నారు.ఆసక్తి,అర్హతగల అభ్య ర్థులు ఈనెల 11న సాయంత్రం 5గంటల్లో పు జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు

- అదనపు కలెక్టర్ శ్యామలాదేవి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఆదిలాబాద్: జిల్లాలో పత్తి కొనుగోళ్లకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆమె కార్యాలయంలో పత్తి వ్యాపారులు, లారీ డ్రైవర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. లారీ వ్యాపారులు అధికంగా ట్రాన్స్‌పోర్ట్ చార్జీ అడుగుతున్నారని వ్యాపారులు పేర్కొన్నారు. అధిక చార్జీలు చెల్లించబోమని, కొనుగోలు నిలిపివేస్తామని అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పత్తి వ్యాపారులు, లారీ అసోసియేషన్ నాయకులు సామరస్య పూర్వకంగా సమస్య పరిష్కరించుకోవాలన్నారు. ఈ దిశగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, జిల్లాలోని ఆయా మార్కెటింగ్ అధికారులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమ్మెబాట

కైలాస్‌నగర్: ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో 104 సేవల ఔట్ సోర్సింగ్ సిబ్బంది సోమవారం నుంచి సమ్మెబాట పట్టారు. వి ధులు బహిష్కరించి కలెక్టరేట్ ఎదుట నిరసన కు దిగారు. సమాన పనికి సమాన వేతనం చె ల్లించాలని, ఏజెన్సీ విధానం రద్దు చేసి ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కైలాస్‌నగర్: పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె 12వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా కార్మికులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం నెలల తరబడి బిల్లులు చెల్లించకుంటే విద్యార్థులకు భోజనం ఎలా వండి వడ్డించాలని ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులతో పాటు పెంచిన వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్యాస్ సిలిండర్లను, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న కార్మికులు

క్లుప్తంగా

శతాధిక వృద్ధుడి మృతి


ఎర్రన్న(ఫైల్)

సోన్: మండలంలోని కూచన్‌పెల్లి గ్రామానికి చెందిన సంగని ఎర్రన్న (100)అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఎర్రన్న కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతుర్లు ఉన్నారు.

అటవీ అధికారులకు దుప్పిపిల్ల అప్పగింత


అధికారికి దుప్పిని అందిస్తున్న ఎస్సై యాసిర్ అరాఫత్

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్, మాడేగాం కాలువను ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతం పరిసరాల్లోని పంటచేనులో పాపన్న అనే రైతుకు సోమవారం దుప్పి పిల్ల కనిపించింది. దానిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రైతు అప్పజెప్పాడు. ఎస్సై యాసిర్ అరాఫత్ అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశాడు. అక్కడికి చేరుకున్న ఫారెస్ట్ బీట్ అధికారి ముస్తాక్‌కు దుప్పి పిల్లను ఎస్సై అందజేశాడు. ఇందులో దిలావర్‌పూర్ అటవీ పరిధి వాచర్ ధనె పోశెట్టి ఉన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఎడులాపురం: ఆటో డ్రైవర్‌పై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై ప్రదీప్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... తాటిగూడ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ఎస్‌కే అయాన్ శనివారం రాత్రి పట్టణంలోని జై జవాన్‌నగర్ నుంచి తాటిగూడకు క్రాంతినగర్ మీదుగా వెళ్తున్నాడు. బబ్లూ అనే వ్యక్తి ద్విచక్ర వాహనం రహదారిపై అడ్డంగా ఉంచాడు. ఆ వాహనాన్ని పక్కకు తీయమనడంతో బబ్లూ, అతడి కుమారుడు ఆఫ్తాబ్, సోదరుడు అయాన్ కర్రలతో ఆటో డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు

ఎదులాపురం: కర్రలతో దాడిచేసి గాయపరిచిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై ప్రదీప్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... పట్టణంలోని తాటిగూడకాలనీకి చెందిన అక్బర్ అనే వ్యక్తిపై ఆదివారం రాత్రి రైల్వేస్టేషన్‌లో పట్టణానికి చెందిన ముజాహిద్, రవి, ప్రకాశ్ దాడికి పాల్పడ్డారు. ఇటీవల పార్కింగ్ బ్యానర్ చించివేశావంటూ ఆరోపిస్తూ అక్బర్‌పై కర్రలతో దాడి చేశారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపాడు.

జ్వరంతో బాలుడి మృతి


ఆర్యన్(ఫైల్)

తాంసి: జ్వరంతో బాలుడు మృతిచెందిన సంఘటన భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... దప్కాల నవనీత్, నిఖిత దంపతుల కుమారుడు ఆర్యన్(7) జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో వసతి గృహంలో ఉంటూ రెండో తరగతి చదువుతున్నాడు. ఆదివారం రాత్రి బాలుడికి జ్వరంతో పాటు ఫిట్స్ రావడంతో వసతిగృహ నిర్వాహకులు తల్లితండ్రులకు సమాచారం అందించి రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మహారాష్ట్రలోని యావత్మాల్‌కు, అక్కడి నుంచి వార్ధాకు తరలిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. వ్యవసాయం చేసుకుంటూ జీవించే ఈ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు మరణించడంతో వారి రోదనలు మిన్నంటాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ముథోల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలో సోమవారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం... న్యూముద్గల్ గ్రామానికి చెందిన గాడేకర్ హరీష్ (33) ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి కాలినడకన బయటకువెళ్లాడు. మండల కేంద్రంలోని పెట్రోల్‌బంక్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్థానికులు 108లో భైంసా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య అర్చన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపాడు.

ఆధారాలు లేకుంటే జప్తే..!

- అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్
- నగదుకు ఆధారాలు లేకుంటే జప్తే..
- మనీ, మద్యం, ఆయుధాల రవాణపై డేగ కన్ను
- ఖాకీల ముందస్తు ప్రణాళిక
- ఇప్పటికే ఎస్పీలతో సీపీ సమావేశం


గూడెం చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

మంచిర్యాలక్రైం: రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా పెద్ద మొత్తంలో నగదుతో బయటకు వెళ్లినా ప్రయాణాలు చేసినా తస్మత్ జాగ్రత్త.. నేటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అధిక మొత్తంలో డబ్బులతో పోలీసులకు దొరికితే జప్తు.. లేదా పేకాట పేరుతో కేసులు నమోదు చేయనున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం ఇప్పటికే ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రధానంగా ఎన్నికల నేపథ్యంలో పెద్దమొత్తంలో డబ్బు, మద్యం, ఆయుధాలు అక్రమ రవాణా జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీస్‌శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి అంతర్‌జిల్లా ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నిరంతరం వాహనాలు తనిఖీ చేయాలని సూచించారు.

ఆధారాలు లేకుంటే జప్తే...

ఎన్నికల సమయంలో నగదు, బంగారం, మద్యం పెద్ద మొత్తంలో తీసుకెళ్లకూడదు. సొంతడబ్బు అయినా లెక్క చూపాల్సిందే. రూ.50 వేలకు పైగా డబ్బులు తీసుకెళ్లాల్సి వస్తే వాటికి తగిన ఆధారాలు చూపించాలి. లేదంటే జప్తు చేయక తప్పదు. ఎక్కువ మాట్లాడితే పేకాట పేరుతో కేసులు నమోదు చేయడం ఖాయం.

బ్యాంకు నుంచి విత్‌డ్రా చేస్తే ...

బ్యాంకు నుంచి రూ.50 వేలకంటే ఎక్కువగా విత్‌డ్రా చేస్తే ఆధారాలు అవసరం. బ్యాంకు అధికారి ఇచ్చిన ఓచర్ స్లిప్ విధిగా వెంట ఉంచుకోవాలి. సెల్ఫ్ చెక్ ద్వారా అయితే సంబంధిత చెక్ జిరాక్స్ కాపీ, ఏటీఎం ద్వారా డ్రా చేస్తే మిషన్ ద్వారా వచ్చిన స్లిప్ వెంట ఉంచుకోవాలి. ఒకవేళ బ్యాంకులో డిపాజిట్ చేయాలనుకుంటే వ్యక్తిగత డిక్లరేషన్, బ్యాంకు పాస్‌బుక్ వెంట ఉంచుకోవాలి.

రికవరీ ఏజెంట్లు...

ఏదైనా సంస్థలో రికవరీ ఏజెంట్లుగా పనిచేసేవారైతే పనిచేస్తున్న కంపనీ గుర్తింపుకార్డు, కలెక్షన్ చేయాల్సిన బాధితుడి పేరు, సెల్‌నంబర్‌తో కూడిన లిస్టు, ఆరోజు ఎవరెవరు ఎంత కలెక్షన్ ఇచ్చారో వారి సంతకంతో కూడిన వివరాలు అధికారులకు చూపించాలి.

అప్పుగా తీసుకుంటే ...

అవసరం నిమిత్తం ఎవరి వద్దనైనా అప్పుగా తీసుకుని వెళ్తుండగా పోలీసులకు పట్టుబడితే ఎవరివద్ద తీసుకున్నారు? ఎప్పుడు తీసుకున్నారు? ఎంత తీసుకున్నారు? తదితర వివరాలతో పాటు ప్రామిసరీ నోటు వెంట ఉంచుకోవాలి. ఒకవేళ ఆస్పత్రి బిల్లులు కట్టాల్సివస్తే పేషెంట్ పేరు, ఆస్పత్రికి సంబంధించిన బిల్లులు వెంట ఉంచుకోవాలి.

నిబంధనలు తప్పనిసరి

ఆదాయ పన్ను చట్టం 1961 సెక్షన్ 69–ఏ ప్రకారం ఎవరైనా తమవద్ద ఉన్న డబ్బు, బంగారం, ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను ఒకచోట నుంచి మరోచోటుకు తరలించే ముందు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించడం తప్పనిసరి.

ఆధారాలు లేకుంటే అంతే..

రానున్న సాధారణ ఎన్నికల దృశ్యా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నారు. ఇలాంటి సమయంలో పెద్దమొత్తంలో నగదు పట్టుబడితే తగిన ఆధారాలు చూపించని పక్షంలో డబ్బు జప్తు చేయబడుతుంది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం రూ.50 వేలకు మించి డబ్బు తీసుకెళ్తే స్వాధీనం చేసుకుంటారు. ఆధారాలు చూపించకుంటే వాటిని ఆదాయపుపన్ను శాఖ ఖాతాలో వేస్తారు. అక్కడి నుంచి డబ్బు పొందాలంటే చుక్కలు లెక్క పెట్టాల్సిందే. లేదంటే ఎన్నికలు పూర్తయిన తర్వాత ఆధారాలు సరిగా లేకపోతే 30 శాతం పన్నుకింద తీసుకుని మిగతా డబ్బులు ఇస్తారు. ఈ నిబంధనలు తెలియక చాలామంది పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్తూ చెక్‌పోస్టుల వద్ద పట్టుబడుతుంటారు.

డిప్యూటీ ఆర్‌ఎంగా ప్రవీణ్‌కుమార్


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రవీణ్‌కుమార్

ఆదిలాబాద్: ఆర్టీసీ రీజియన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెయింటెనెన్స్)గా కే. ప్రవీణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ డీఎం(ఎం)గా బాధ్యతలు నిర్వర్తించిన సురేశ్‌చౌహాన్‌ను సికింద్రాబాద్ డిప్యూటీ ఆర్‌ఎం (మెయింటెనెన్స్)గా బదిలీపై వెళ్లారు.

వాహనాల తనిఖీ

నిర్మల్ రూరల్: ఎలక్షన్ కోడ్ అమలులోకి రావడంతో జిల్లా కేంద్రంలో పోలీసుల తనిఖీలు ప్రారంభమయ్యాయి. సోమవారం సాయంత్రం మంజులాపూర్‌లో జాతీయ రహదారిపై రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ వెంట రూ.50 వేల కన్నా ఎక్కువ డబ్బులు తీసుకెళ్తే రశీదు వెంట ఉంచుకోవాలని సూచించారు.

డబ్బులు పట్టివేత

సారంగపూర్: మండల కేంద్రంలో సోమవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించగా మండలంలోని మలక్‌చించోలికి చెందిన దాసరి లక్ష్మణ్ వద్ద రూ.లక్షా ఆరువేలు పట్టుబడినట్లు ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి తెలిపారు. వీటిని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జీవో3 పునరుద్ధరణకు ఆర్డినెన్స్ జారీ చేయాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్


నిరసన తెలుపుతున్న ఆదివాసీ నాయకులు

ఎదులాపురం: ఏజెన్సీలో వందశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జీవో నంబర్ 3 పునరుద్ధరణకు కేంద్రం తక్షణమే ఆర్డినెన్స్ జారీ చేసి అమలు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. అమిత్ షా ఆదిలాబాద్ జిల్లా పర్యటన నేపథ్యంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో ఈ మేరకు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సచిన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలకు వ్యతిరేకంగా పర్యావరణ అటవీ చట్టాన్ని తీసుకొచ్చి అడవులను ప్రైవేటీకరణ చేస్తోందని విమర్శించారు. అలాగే ఏజెన్సీలో వందశాతం ఉద్యోగాలు కల్పించే జీవో.3 పునరుద్ధరణ కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా ఆర్డినెన్స్ జారీ చేసి అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం అడవులను ప్రైవేటీకరణ చేస్తూ ఆదివాసీలపై ప్రేమ ఉన్నట్టు మొసలి కన్నీరు కారుస్తుందని విమర్శించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆదివాసీలపై దాడులు పెరిగాయని ఆరోపించారు. అమిత్ షాకు ఆదివాసీల పై ప్రేమ ఉంటే వెంటనే జీవో.3 పునరుద్ధరణ కోసం పార్లమెంట్‌లో ఆర్డినెన్స్ జారీ చేసి అమలు చేయాలన్నారు. ఇందులో ఆదివాసీ నాయకులు సిడాం దౌలత్‌రావు, మడావి జాలీమ్ శావ్, కుమ్ర భీంరావు, సుంగ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఎన్నికలు బహిష్కరిస్తాం


కలెక్టరేట్ గేట్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కైలాస్‌నగర్: గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుంటే అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని కుండి షేక్‌గూడ గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ గాదిగూడ మండలంలోని కుండి షేకుగూడ ఏర్పడి 70ఏళ్లు గడిచిన రోడ్డు సౌకర్యం లేదన్నారు. తమ గ్రామంతో పాటు కొలాంగూడ, మారుతిగూడ చిన్నకుండి, పిప్పిరి గ్రామం వరకూ వెళ్లాలంటే ఏడు కిలో మీటర్ల వరకు నాగులు వంకలు దాటుతూ కాలినడకన వెళ్లాల్సి వస్తుందని వివరించారు. అనారోగ్యం పాలైన వారిని ఝరి పీహెచ్‌సీకి చేర్చాలంటే ఇదే మార్గంలో వెళ్లాల్సి ఉంటుందని, గర్భిణులు నడక యాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులను కలిసి విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. అనంతరం కార్యాలయంలోకి వెళ్లేందుకు పోలీసులు నిరాకరించడంతో గేటుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడాం దౌలతీ రావు కుంరం భీంరావు సిడాం పరశురాం, చిత్రు, గోవిందరావు పాల్గొన్నారు.

గంజాయి సాగుచేసిన ముగ్గురి అరెస్టు

- రూ.36లక్షల గంజాయి మొక్కల స్వాధీనం..


వివరాలు వెల్లడిస్తున్న ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్

ఉట్నూర్‌రూరల్: గంజాయి సాగుచేసినా, విక్రయించినా చర్యలు తప్పవని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ హెచ్చరించారు. వ్యవసాయ చేనులో గంజాయి సాగు చేస్తున్న ముగ్గురిని పట్టుకుని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి వివరాలను సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నాగేందర్ వెల్లడించాడు. మండలంలోని నర్సాపూర్-బి పంచాయతీ పరిధిలోని పెందూర్‌గూడ గ్రామానికి చెందిన పెందూర్ మారుతికి సంబంధించి వ్యవసాయ చేనులో 130 గంజాయి మొక్కలు, ఆడ జగన్నాథ్ చేనులో 30, దుర్వ నాగోరావు చేనులో 200 గంజాయి మొక్కలు సాగు చేస్తుండగా ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ రామకృష్ణ, ఎస్సై మనోహర్ దాడులు చేసి పట్టుకున్నారు. వాటి విలువ సుమారుగా రూ.36 లక్షలు ఉంటుందని, వెంటనే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. ఏజెన్సీలో గిరి రైతులు గంజాయి మొక్కలను సాగుచేసి జైలుపాలు కావద్దన్నారు. సమావేశంలో సీఐ రామకృష్ణ, ఎస్సై మనోహర్, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు నిలిపివేయాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

నిర్మల్ రూరల్: తమ ఊరి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో తమ పిల్లలు చదువులో రాణిస్తున్నారని, ఉపాధ్యాయుల కృషితో జాతీయ గుర్తింపు వచ్చిందని, ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులను బదిలీ చేయవద్దని కుంటాల మండలం పెంచికల్‌పాడ్ గ్రామస్తులు డీఈవోకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బోధించే ఎల్లన్న వచ్చిన తర్వాత విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందుతోందన్నారు. గ్రామ విద్య ప్రాజెక్టు ద్వారా పాఠశాలకు అదనపు సమయం కేటాయించి విద్యార్థులకు బోధిస్తున్నారన్నారు. పాఠశాల నుంచి ప్రతీ సంవత్సరం గురుకుల, నవోదయ సీట్లు లభిస్తున్నాయన్నారు. ఎన్జీవోల సహకారంతో విద్యార్థుల కోసం ఆట వస్తువులు విరాళాలు సేకరించి డిజిటల్ విద్యను అందిస్తున్నారన్నారు. 5వ తరగతిలో నిరుపేద విద్యార్థులను దత్తత తీసుకుని చదివిస్తున్నారన్నారు. ఇలాంటి మంచి పనులు చేస్తున్న తమ ఉపాధ్యాయుడిని ఎట్టి పరిస్థితుల్లో బదిలీ చేయొద్దని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సర్పంచ్ కదం భోజబాయ్, ఎస్‌ఎంసీ చైర్మన్ బాబారావు, వైస్ చైర్మన్ అనిత, గ్రామస్తులు లక్ష్మణ్, ఆనంద్, గణేశ్, నవీన్, ముత్తవ్వ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటే

- డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే అని తెలంగాణ సమాజానికి పూర్తిగా అర్థమైందని, వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు కోరారు. నర్సాపూర్(జి) మండలం అంజనీతండా గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప గడచిన తొమ్మిదేళ్లలో ప్రజలకు ఏమీ చేయలేదన్నారు. మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సీఎం కేసీఆర్ డ్రామాలు ఆడుతూ కొత్త పథకాలు ప్రకటిస్తున్నారని విమర్శించారు. రాబోవు రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

భర్త, అత్తమామ, ఆడబిడ్డకు ఏడేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: భార్య మరణానికి కారణమైన భర్త, అత్తమామలు, ఆడబిడ్డకు నిర్మల్ న్యాయస్థానం ఏడేళ్ల కఠిన కరాగారా జైలుశిక్ష, జరిమానా విధించింది. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ వివరాల ప్రకారం.. సారంగాపూర్ మండలంలోని బోరిగామ్ గ్రామానికి చెందిన బైరెడ్డి రాంరెడ్డికి మామడ మండలంలోని కొరిటికల్ గ్రామానికి చెందిన బైరెడ్డి శ్రీలత(27)తో 2012లో పెద్దల సమక్షంలో పెళ్లి చేశారు. వరకట్నంగా రూ.3లక్షలు, 8తులాల బంగారం, ఇతర సామగ్రి అందించారు. పెళ్లైన కొన్ని రోజులు వీరి కాపురం సజావుగా సాగింది. ఒప్పుకున్న మిగితా రూ.లక్ష తీసుకురావాలని భర్త, అత్తమామ, ఆడబిడ్డలు మానసికంగా, శరీరకంగా చిత్రహింసలకు గురిచేయడం మొదలుపెట్టారు. దీంతో శ్రీలత వారు పెట్టే బాధలు తట్టుకోలేక పుట్టింటికి వెళ్లినప్పుడల్లా కుటుంబ సభ్యులు నచ్చజెప్పి పంపించేవారు. రెండేళ్ల తరువాత వారికి అంగవైకల్యంతో పాప జన్మించింది. ఆ పాప పేరు మీద రూ.5లక్షలు డిపాజిట్ చేసేందుకు డబ్బులు కావాలని, మోటార్ సైకిల్ కొనివ్వాలని వేధించడం మొదలుపెట్టారు. దీంతో శ్రీలత బంధువులు బోరిగామ్‌లో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టి అత్తింటికి పంపించారు. మళ్లీ కొన్ని రోజుల తరువాత భర్తతో పాటు అత్త రాజవ్వ, మామ గంగారెడ్డి, ఆడబిడ్డ గంగామణి పాప ఆస్పత్రి ఖర్చులకు డబ్బులు కావాలని వేధించడం మొదలుపెట్టారు. ఆ బాధ భరించలేక 18 జులై 2015 పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో శ్రీలత తమ్ముడు లింగారెడ్డి సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై, ప్రస్తుత నిర్మల్‌రూరల్ సీఐ శ్రీనివాస్, అప్పటి డీఎస్పీ మనోహర్ కేసు నమోదు చేసి నేరస్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు 19 మందిని సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో ఏడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ సోమవారం తీర్పునిచ్చారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు


అర్జీలు స్వీకరిస్తున్న డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీడీ దిలీప్‌కుమార్ అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల తమ సమస్యలను పరిష్కరించాలంటూ అర్జీలు అందజేశారు. బెజ్జూర్ మండలం కూడా గ్రామానికి చెందిన కె.భారతి తనకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించాలని కోరింది. తలమడుగు మండలం పల్సి గ్రామానికి చెందిన మడావి అశ్విని బీఈడీ కళాశాలలో ప్రవేశం కల్పించాలని, పెంబి మండలం కొలాంగూడ గ్రామానికి చెందిన ఆత్రం మాణిక్‌రావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అవ్వల్ అంబులెన్స్‌కు డ్రైవర్‌గా ఉద్యోగం కల్పించాలని అర్జీ సమర్పించాడు. పింఛన్, రెండు పడకల గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ ప్రజలు దరఖాస్తులు అందజేశారు. ప్రజావాణిలో ఏపీవో కనక భీంరావు, ఏడీఎం హెచ్‌వో బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, జేడీఎం నాగభూషణం ఉన్నారు.

కడుపునొప్పితో వివాహిత ఆత్మహత్య

తాంసి: కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన భీంపూర్ మండలంలోని కరంజి(టి) పంచాయతీ పరిధిలోని ఇంద్రనగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఇంద్రనగర్ గ్రామానికి చెందిన శేండాల రమ(35) భర్తతో కలిసి గ్రామంలో సాగుభూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. కొన్ని రోజులుగా రమ కడుపునొప్పితో బాధపడుతూ ఈ నెల 7వ తేదీన రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. మృతదేహాన్ని రిమ్స్‌లో ఎస్సై లాల్‌సింగ్ నాయక్ పరిశీలించి పంచనామా నిర్వహించారు. భర్త సురేష్ ఫిర్యాధు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు..

ముథోల్: మండలంలోని ఎడ్‌బిడ్ తండా గ్రామానికి చెందిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... జాదవ్ శ్రీనివాస్ (31) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం తల్లిదండ్రులు తాగవద్దని మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'దళితబంధు' విషయంలో మహిళలపై దాడి

- కిర్గుల్(కె) గ్రామంలో ఘటన
- భైంసా ఏరియా ఆసుపత్రికి తరలింపు
- ఎమ్మెల్యే సమక్షంలోనే వాగ్వాదం


గాయపడిన జ్యోతిని ఆసుపత్రికి తరలిస్తున్న గ్రామస్తులు

భైంసా: బాసర మండలం కిర్గుల్(కె) గ్రామంలో మహిళలపై గ్రామ సర్పంచు దాడికి దిగినట్లు గ్రామస్తులు ఆరోపించారు. గ్రామస్తుల వివరాల ప్రకారం .. బాసర మండలం కిర్గుల్(కె) గ్రామంలో సోమవారం ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇదే సమయంలో గ్రామంలోని కొంతమంది తమకు దళితబంధు రాలేదని స్థానిక సర్పంచ్‌ని అడిగితే మీకెందుకివ్వాలని అంటున్నాడని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే తమకు ఎస్సీ కమ్యూనిటీ హాల్ కావాలని కోరగా ఎమ్మెల్యే హామీ ఇచ్చాడు. గతంలో కమ్యూనిటీ హాల్‌కు నిధులు ఇచ్చినా ఎందుకు నిర్మించుకోలేదని ప్రశ్నించాడు. అదే సమయంలో దళితబంధు స్థానిక సర్పంచు తనకు చెందిన వారికే ఇస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో సర్పంచుకు, స్థానికులకు ఎమ్మెల్యే సమక్షంలోనే వాగ్వివాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అక్కడి నుంచి సీసీ రోడ్లు, పంచాయతీ భవనం ప్రారంభించి వెళ్లాడు. ఆ సమయంలోనే సర్పంచు గ్రామానికి చెందిన జ్యోతి, సవితలపై దాడికి దిగినట్లు గ్రామస్తులు ఆరోపించారు. బంధువులు జ్యోతి, సవితలను వెంటనే భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. దళితబంధు విషయంలోనే సర్పంచుతో పాటు గంగాధర్, తుకారం తమపై దాడికి పాల్పడ్డారని బాధితురాలు జ్యోతి ఆరోపించింది.

నాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు..

మహిళపై తాను దాడిచేసినట్లు అసత్య ఆరోపణలు చేస్తున్నారని సర్పంచు దేవేందర్ అన్నారు. కొందరు దళారులు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిలో ప్లాట్లు చేసి విక్రయిస్తే తాను అడ్డుకున్నానని, దీంతో వారంతా కలిసి ఇలా మహిళలను రెచ్చగొట్టి తనపై అసత్య ఆరోపణలు చేయిస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో పూర్తిస్థాయి విచారణ చేస్తే అన్ని విషయాలు వెల్లడవుతాయని, పాత కక్ష్యలతోనే ఇలా తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని మండిపడ్డారు.